1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శనివారం | జనవరి 6, 2024 | www.navatelangana.com

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి : ఎంపీపీ

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వం అరు గ్యారెంటీల కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం శ్యాంపూర్ గ్రామంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాల కోసం గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దవులే బాలాజీ, సర్పంచ్ మల్లిక శంకర్, కార్యదర్శి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దే స్వామి, సీసీఎస్ సీఐ ముత్యాల రాజు అధ్వర్యంలో శుక్రవారం ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని నవేగాంబస్తీకి చెందిన వివేకానంద యూత్ సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీ తౌటం కిరణ్, తిరుపతి, మహేందర్, రవి, శ్యాంసుందర్, వెంకటేష్, మహేష్, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



రాజ్యాసభ సభ్యుడిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీజేపీ రాజ్యాసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో గెలుపొందిన తరువాత తొలిసారి శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాజ్యాసభ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఆదిలాబాద్‌లో బీజేపీ గెలిచే విధంగా కార్యకర్తలను సన్నద్ధం చేసే బాధ్యత మరింత పెరిగిందని ఎమ్మెల్యేకు సూచించారు. ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేలా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తాడిహత్నూర్ టీజీబీ బ్రాంచ్ అధ్వర్యంలో కళాజాతా ద్వారా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్ బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందించే బీమా పథకాలు, క్రాప్ లోన్, డ్వాక్రా మహిళ సంఘాల రుణాలు, బ్యాంక్ ఇచ్చే నమ్మకం, భద్రత, భరోసాను తెలియజేశారు. అనంతరం విద్యార్థినులకు కాపీలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎస్‌సి నిర్వాహకులు ఫడ్ రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ, ఉపాధ్యాయ సిబ్బంది విశ్వనాథ్, హరిచంద్, రజినీకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ చట్టం 2022-23 సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ చట్టంలో సంవత్సర కాలంలో నిర్వహించిన పనులను తనిఖీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీఓ ప్రమీల, ఆర్ఎస్‌పి మహేష్, డిఆర్‌పి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన డిజే యజమానిపై కేసు

నవతెలంగాణ-మందమర్రి

నిబంధనలకు విరుద్ధంగా పెండ్లిలో డీజే పెట్టి దురుసుగా ప్రవర్తించిన డీజే యజమానిపై కేసు నమోదు చేసి డీజే సీజ్ చేశామని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీజేలపై నిషేధ ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ గురువారం రాత్రి మార్కెట్ ప్రాంతంలో డీజే నడుపుతూ న్యూసెన్స్ చేసున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికెళ్లారు. బ్లూకోట్స్ కానిస్టేబుల్స్‌తో దురుసుగా ప్రవర్తించిన యజమాని మహమ్మద్ సల్మాన్ చోటుపై కేసు నమోదు చేసి డీజేను సీజ్ చేశారు. డీజేలు వాడటం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులకు గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, చదువుకునే పిల్లలకు కూడా ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున డీజే సౌండ్స్ వినియోగించరాదని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా నిషేధాజ్ఞలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశంలో ముఖ్యంగా పెళ్లిళ్ల బరాత్‌లో డీజే సౌండ్స్ వాడినట్లయితే డీజే యజమానులతో పాటు నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్ఈ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని ఎస్ఈ శుక్రవారం సందర్శించారు. కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామని ఎస్ఈ పేర్కొన్నారు. అనంతరం కంద్రి వాగు సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించారు. అక్కడి నుండి కరత్వాడ వెళ్లి మిషన్ భగీరథ సంపును పరిశీలించారు. మంచినీటి సరఫరా సక్రమంగా జరగాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట గ్రిడ్ ఈఈ గోపీచంద్, గ్రిడ్ డీఈ వెంకటేశ్వర్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ దేవయ్య ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. శుక్రవారం మండలంకోని దస్నాపూర్‌లో జవాడే పార్వతాబాయి కేశవ్, కేస్లాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. దానిలో భాగంగా గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం రేణుక, ఆలయ చైర్మన్ మెస్రం తుకారాం పాల్గొన్నారు.

సింగరేణి యత్నం..!

- పర్యావరణాన్ని పసిగట్టే మిషన్ బిగించడంతో మందకొడిగా పనుల నిర్వహణ
- సింగరేణి యాజమాన్య తీరును అధికారులు గుర్తించాలి : గ్రామస్తులు

పర్యావరణ పరిరక్షణ శాఖను తప్పుదోవ పట్టించేందుకు

నవతెలంగాణ-జైపూర్

పర్యావరణ పరిరక్షణ శాఖను తప్పుదోవ పట్టించేందుకు సింగరేణి అధికారులు కుట్ర చేస్తున్నారని రామారావుపేట్ గ్రామ పంచాయతి సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతితో పాటు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని-2 ఏర్పాటుతో ఎదురవుతున్న ఇబ్బందులు, హైకోర్టును ఆశ్రయించిన తీరును శుక్రవారం విలేకరుల ముందు వివరించారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని-2లో నియమ నిబంధనలు పక్కనపెట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్న గ్రామస్తులు పర్యావరణ శాఖ ఏర్పాటు చేసిన మిషన్ పర్యావరణాన్ని పసిగట్టకుండా కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ గని తవ్వకాలతో చెలరేగుతున్న దుమ్ముధూళి కారణంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, ఓసీలో చేపడుతున్న భారీ పేలుళ్లతో నివాస గృహాలు బీటలు వారుతున్నాయని, డంపు యార్డ్ మీదుగా వచ్చే కలుషిత నీటితో పంటలు సాగు చేయలేపోతున్న తీరును కోర్టు ముందు ఉంచడం జరిగిందని తెలిపారు. ఇదే విషయమై అనేక పర్యాయాలు సింగరేణి అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో పాటు నేరుగా పరిస్థితులను వివరించినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇక తప్పదనుకున్న సమయంలో హైకోర్టును ఆశ్రయించి అక్రమ ఓసీ తవ్వకాలు నిలిపివేయాలని కోరినట్లు వెల్లడించారు. ఈ విషయమై స్పందించిన హైకోర్టు ధర్మాసనం పర్యావరణ శాఖ నిజామాబాద్, డైరెక్టర్ జనరల్ మైనింగ్ అండ్ సేఫ్టీ హైదరాబాద్, సింగరేణి సీఎండీతో పాటు శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నోటీసులు జారీ చేసిందని తెలిపారు.



వాహనాల రాకపోకలు లేక బోసిపోయిన డంప్ యార్డు

కోర్టు దృష్టి మళ్లించేందుకు యాజమాన్యం కుటిల నీతి

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని-2 తవ్వకాలతో రామారావుపేట్‌లో పర్యావరణ సమతుల్యతను గుర్తించకుండా సింగరేణి అధికారులు కుటిల నీతికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పర్యావరణాన్ని పసిగట్టేందుకు మిషన్ ఏర్పాటు చేసినట్లు తెలుసుకున్న సింగరేణి అధికారులు శుక్రవారం నుండి ఓసీ-2లో తవ్వకాలు దాదాపుగా నిలిపివేసినట్లు తెలిపారు. అంతే కాకుండా రోజు వారిగా వందల సంఖ్యలో లారీల ద్వారా బొగ్గును తరలించిన యాజమాన్యం ఒకటి రెండు లారీలతో బొగ్గును తరలిస్తోందని ఆరోపించారు. అదేవిధంగా ఒకటి రెండు సార్లు వాటర్ క్యూరింగ్ చేయిస్తున్న సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గని తవ్వకాలతో పర్యావరణానికి ఎలాంటి నష్టం లేనట్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

సింగరేణి యాజమాన్యం తీరును అధికారులు గుర్తించాలి

శ్రీరాంపూర్ ఓసీ కారణంగా పర్యావరణానికి విఘాతం కలుగుతుందని హైకోర్టును ఆశ్రయించడంతో సింగరేణి అధికారులు తమ తీరును మార్చుకుని ఉన్నది లేనట్లుగా చిత్రీకరించే ప్రయత్నాలను అధికారులు గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఒక వైపు ఓసీలో తవ్వకాలు దాదాపుగా నిలిపివేసిన అధికారులు, ఓబీ డంపు తరలింపు, ఎప్పటికప్పుడు వాటర్ క్యూరింగ్ చేపిస్తూ మరో మారు తమకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం బిగించిన మిషన్ ద్వారా 24 గంటల వ్యవధితో పర్యావరణాన్ని లెక్కించనున్నట్లు తెలుసుకున్న అధికారుల తీరును గుర్తించాలని కోరుతున్నారు.



రామారావుపేటలో బిగించిన యంత్రం

లక్ష్య సాధనకు సమిష్టిగా ముందుకెళ్దాం..

- ఈ ఆర్థిక సంవత్సరం 70మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాలి
- ఇకపై రోజుకు 2.24లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా చేయాలి
- రోజుకు 15లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- సింగరేణి అన్ని విభాగాల జీఎంలతో సమీక్షలో సీఎండీ ఎన్.బలరాం దిశా నిర్దేశం

నవతెలంగాణ-నస్పూర్

లక్ష్య సాధనకు సమిష్టిగా ముందుకెళ్దామని సింగరేణి సిఅండ్ఎండి బలరాం అన్నారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పాల్గొన్నారు. సింగరేణి కాలరీస్ ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ప్రతి రోజూ విలువైనదేనని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం స్పష్టం చేశారు. దేశ ఇంధన అవసరాలు, రానున్న వేసవి కాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండేందుకు వీలుగా రోజుకు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని, రోజుకు 15లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. సింగరేణి కాలరీస్ చైర్మన్, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలతోపాటు వివిధ విభాగాల జీఎంలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉత్పత్తిపై సమీక్షించారు. సంస్థ పురోభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మొదటి 9నెలల కాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. గత ఏడాదితో పోల్చితే బొగ్గు ఉత్పత్తిలో 5.15 శాతం వృద్ధితో 49.66 మిలియన్ టన్నులు, రవాణాలో 8 శాతం వృద్ధితో 51 మిలియన్ టన్నులు, ఓవర్ బర్డెన్ తొలగింపులో 6శాతం వృద్ధితో 306.6 మిలియన్ క్యూబిక్ మీటర్ల మేరకు లక్ష్యాలను సాధించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న మూడు నెలల్లోనూ సమిష్టిగా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఒక జట్టుగా ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరి పనితీరును పరిశీలిస్తానన్నారు. అలాగే నూతన ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎదురవుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ, ఇతర అనుమతులపై ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. సింగరేణి సంస్థ ఒడిశాలోని నైనీలో చేపట్టిన బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారని, త్వరలో ఆయన నేతృత్వంలో సింగరేణి ఉన్నతాధికారుల బృందం ఆ రాష్ట్రంలో పర్యటిస్తుందని వెల్లడించారు.





విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, జిల్లా కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు మడావి గణేష్, మడావి నగేష్, కుడ్మెత బండు, యువిరాజ్, అంబజి మారుతి, శ్రీకర్ పాల్గొన్నారు.

ఇథనాల్ బాధిత రైతులతో కలెక్టర్ సమావేశం



ఎస్పీని సన్మానిస్తున్న రైతులు, నాయకులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని గుండంపల్లి సరిహద్దు పంటపొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని రైతులు కొన్ని నెలలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పనులు నిరంతరం కొనసాగడంతో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేశారు. గ్రామస్తుల ఆందోళనకు కార్యక్రమాలు తెలుసుకున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం రైతులు, నాయకులు, ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో వివరణ కోరారు. గ్రామస్తులు ఫ్యాక్టరీ పూర్తి వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నది తీరానికి అత్యంత సమీపంలో ఉండడం వల్ల మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతున్న గ్రామాలకు తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల స్పందన విన్న కలెక్టర్ ఫ్యాక్టరీ పనులు గురించి కమిషన్ వేసి గ్రామస్తుల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించాలని సూచించారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

గ్రామస్తులు బుధవారం చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు లాఠీ చార్జి చేసి పలువురు రైతులపై కేసులు నమోదు చేశారు. రైతులు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదని, అయినా పోలీసులు కేసులు నమోదు చేశారని ఎస్పీ జానకీ షర్మిలను కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ ప్రశాంత వాతావరణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

పోరాటానికి పూర్తి మద్దతు : డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

ఇథనాల్ ఫ్యాక్టరీతో వాయు, జల కాలుష్యం ఏర్పడి ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతుందని, రైతులు వ్యతిరేకించే ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపేయాలని చేసే పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. ప్రజలు చేపట్టే ప్రతి నిరసన కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. ఇకపై నిరంతరం వివిధ రూపాల్లో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బోథ్‌లో జాతీయ పక్షి దినోత్సవం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జాతీయ పక్షి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ మాట్లాడుతూ పక్షుల వలన ఎన్నో లాభాలు ఉన్నాయని, అవి ప్రకృతికి అందాన్ని ఇస్తాయని తెలిపారు. అటవీ సంపద వృద్ధిలోనూ పుప్పొడి ఫలదీకరణలో ప్రమాదకర క్రిమి కీటకాలను తినడంతో పంటల తెగుళ్లను అరికట్టడం జరుగుతుందన్నారు. మానవాళి తప్పిదాల వల్ల ప్రతి సంవత్సరం ఎన్నో పక్షి జాతులు అంతరిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా అడవుల నరికివేత, వేటగాళ్ల దొంగతనంతో చాలా నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు లింగంపల్లి సంతోష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొండూరు గంగాధర్‌కు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కొండూరు గంగాధర్‌ను రుయ్యాడి గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూంద్రు పోతారెడ్డి, హస్నేస్ హౌస్నేస్ కమిటీ సభ్యులు మోతి శ్రీనివాస్, గోక వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజలు గోక ప్రకాష్‌రెడ్డి, సామ చినగంగారెడ్డి, గాజుల నర్సిములు, నెట్టడి గంగాధర్, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ షురూ



జైపూర్ : భీమారం మండలంలో ప్రజాపాలన ద్వారా అందిన అర్జీల డాటా ఎంట్రీ మొదలైందని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుండి అందిన 5,115 అర్జీల డాటా ఎంట్రీని ప్రారంభించినట్లు తెలిపారు. మండల పరిధిలో గల 11 గ్రామ పంచాయతీలలో తహసీల్దార్ విశ్వంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలనకు సంబంధించిన డాటా ఎంట్రీ కొనసాగుతున్నట్లు తెలిపారు. శనివారంతో పూర్తి కానున్న ప్రజాపాలన ద్వారా అందిన పూర్తి అర్జీల డాటా ఎంట్రీ పూర్తి చేసి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హజరయ్యారు. శుక్రవారం హస్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాల కోసం గ్రామపంచాయతీలో దరఖాస్తులు చేసుకోవాలని, ప్రజలు గ్రామపంచాయతిలో అందిస్తున్న ఉచిత ఫారాలను తీసుకోవాలని కోరారు. ఉచిత పథకాలపై ఎలాంటి అపోహలు చెందకూడదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్, కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.



గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన అడవి సారంగాపూర్, రాజులమడుగు, గోండుగూడ గ్రామాలలోని గోండ్, కొలాం తెగలకు చెందిన నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన 100 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకట స్వామి మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా క్యాబినెట్ కోశాధికారి పాలెపు సుదర్శన్, జిల్లా చైర్మెన్ కారింగుల వెంకటేశ్వర్లు, ఖానాపూర్ తహసీల్దార్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్, ఎంపీఓ, ఎఈఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఏఈ పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పీచర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లి పదోన్నతి పొందినటువంటి మిట్టపల్లి నర్సయ్యను, అలాగే బదిలీపై వెళ్లినటువంటి ఉపాధ్యాయురాలు సబిత, ఇతర పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సుధీర్‌రావు, శ్రీనివాస్, నర్సయ్యలకు శుభాకాంక్షలు తెలుపుతూ సర్పంచ్ బుర్రి లత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీచర సర్పంచ్ బుర్రి లత, ఎంపీటీసీ రాజేశ్వర్, విద్య కమిటీ చైర్మెన్ అభిసారిక, విశ్రాంత ఉపాధ్యాయులు గంగారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైనవారికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్హులైన 9 మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగి ఉండి ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ లేని లబ్దిదారులకు ఈ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందచేయబడుతుందని అన్నారు. అర్హులైన బీపీఎల్ కుటుంబాలు తమ దగ్గరలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద దరఖాస్తులను సమర్పించాలని అన్నారు. జిల్లా ప్రజలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఎస్ఓ కిరణ్ కుమార్, గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

లక్ష్మణచాంద మండల కేంద్రంతో పాటు తిరుపల్లి, కంజర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఆయా గ్రామాల గ్రామస్తులు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, డిపో మేనేజర్ ప్రతిమరెడ్డికి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నుంచి ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈటల శ్రీనివాస్, వొద్నలా రాజేశ్వర్, అట్ల చిన్న రాంరెడ్డి, అట్ల రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈటల లచ్చన్న, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, కంజర్ గ్రామ సర్పంచ్ ప్రభాకర్, దశరథ్, బొర్రన్న, సలీం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ రక్త నమూనాల సేకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

సికిల్‌సెల్ రక్త నమూనాల శుక్రవారం డాక్టర్ సర్వరాజ్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ మండలంలోని అంకోలి సబ్ సెంటర్ పరిధిలోని కొలాంగూడలోని ప్రజలకు సికిల్‌సెల్ రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వరాజ్ మాట్లాడారు. గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. రక్త పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సు శ్యామల, ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు ఈశ్వరీదేవి, వేణుతాయి, ఆశకార్యకర్త గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జుకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఫోటో యూనియన్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫోటో గ్రాఫర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్, ఫోటో గ్రాఫి యూనియన్ మండల అధ్యక్షులు చవాన్ సేవదాస్, జిల్లాపెల్లి రూబెన్, జనరల్ సెక్రటరీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్ ఉన్నారు.

అవినీతిపై పోరాటం ఆగదు

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యం



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఎవరెన్ని కుయుక్తులు పన్నినా తాము మాత్రం అవినీతిపై పోరాటం ఆపమని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం జరుగాల్సిన అవిశ్వాస తీర్మాణ ప్రక్రియ నిలిచిపోయిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల మున్సిపాలిటీలో తాత్కాలికంగా అవిశ్వాస బల పరీక్ష నిలిచి పోయిందని అన్నారు. పట్టణంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీసి, ప్రజలకు బహిరంగా పరచడమే తమ ఉద్యేశమని చెప్పారు. పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు ఎందుకు నిలిచి పోయాయో ప్రజలకు తెలుసునని ఆరోపించారు. శ్మశానవాటిక, డంప్ యార్డు, పార్కు పనుల్లో జరిగిన సభ్యులు చేసిన తీర్మాణాన్ని కాదని తీర్మాణానికి విరుద్ధంగా పనులు చేయడాన్ని వెలికి తీస్తామన్నారు. పట్టణంలో కొందరు పెద్దమనుషులు చేస్తున్న దుర్మార్గమైన విధానాలను ప్రజలు గ్రహిస్తున్నారని ఆరోపించారు. తన ఇల్లు రోడ్డు వెడల్పులో పోతుందని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడే పట్టణాభివృద్ధికి విరోధంగా మారాడని ఆరోపించారు. ప్రజలకు మంచి జరిగే విషయంలో ముందుండాలే గాని అవినీతి పరులను ప్రోత్సహించేలా ఉన్న పెద్ద మనుషులను ఎవరూ పట్టణ ప్రజలు సహించరని హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కావలి సంతు, కిషోర్ నాయక్, జన్నారపు లక్ష్మీ, నాయిని స్రవంతి, అఫ్రీనా భేగం, ఫౌజియా బేగం, పరిమి లత, తొంటి శ్రీనివాస్, నాయకులు హమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా, సురేష్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, హైమద్ ఉన్నారు.

కమీషనర్ తీరుపై సభ్యుల ఆగ్రం..

అవిశ్వాస ప్రక్రియకు సంబంధించిన కోర్టు స్టే కాపీని కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాలక సభ్యులకు ఇవ్వక పోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులకు చెప్పకూడని రహస్యం అందులో ఏముందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆయన సదరు ఉత్తర్వు కాపీలో ఉన్న విషయాన్ని కౌన్సిలర్లకు చదివి వినిపించారు.

నిలిచిన మున్సిపల్ విశ్వాస బల పరీక్ష

- కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆగిందన్న ఆర్డీఓ



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఖానాపూర్ మున్సిపాలిటీలో చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై శుక్రవారం జరుగాల్సిన అవిశ్వాస తీర్మాణ బల పరీక్ష కోర్టు ఆదేశాలతో నిలిచి పోయిందని ఆర్డీఓ రత్న కళ్యాణి తెలిపారు. ఆరు నెలల కింద ఖానాపూర్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్‌పై 9 మంది మెజార్టీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాణ నోటీసు ఇచ్చారు. ఈమేరకు కలెక్టర్ ఈనెల 5న అవిశ్వాస బల పరీక్షకు ఆదేశించారు. అయితే అవిశ్వాస తీర్మాణ ప్రక్రియను నిలిపి వేయాని కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో సదరు కాపీని ఆర్డీఓ రత్న కళ్యాణి కాపీని మున్సిపల్ కమీషనర్‌కు అందజేసి వెళ్లిపోయారు.

ఆర్డీఓను నిలదీసిన కౌన్సిలర్లు..

అవిశ్వాస తీర్మాణం నిలిపి వేయాలని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పి పూర్తి వివరాలు చెప్పకుండా వెళ్లి పోవడాన్ని నిరసిస్తూ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. అవిశ్వాస ప్రక్రియ ఎందుకు నిలిచి పోయిందో వివరించాలని నిలదీశారు. అధికారుల తీరు చూస్తే అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. ఈ నిరసనలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు కావలి సంతోష్, జన్నారపు విజయ లక్ష్మీ, నాయిని స్రవంతి, అఫ్రీనా భేగం, పరిమి లత, ఫౌజియా భేగం, తొంటి శ్రీనివాస్ ఉన్నారు.

కోర్టు ఆదేశాల మేరకు నిలిపేశాం : ఆర్డీఓ

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ , వైస్ చైర్మెన్‌పై జరుగాల్సిన అవిశ్వాస తీర్మాణం బల నిరూపణ కోర్టు ఆదేశాల మేరకు నిలిచి పోయిందని ఆర్డీఓ రత్న కళ్యాణి వివరించారు. తదుపరి ప్రక్రియ ఎప్పుడనేది తాను చెప్పలేనని తెలిపారు. కోర్టు స్టేకు కారణాలను మాత్రం ఆమె వెల్లడించలేదు.

రేపటి నుంచి జాతీయ దీక్షాభూమి జాతర

- ముస్తాబైన జగదాంబదేవి ఆలయం
- పలు రాష్ట్రాల నుంచి కొత్తపల్లి(హెచ్)కు తరలిరానున్న బంజారాలు, లంబాడాలు
- ఈనెల 7 నుంచి 11 వరకు 5రోజులపాటు కొనసాగనున్న జాతర
- 11న గురుకృప దీక్ష దినోత్సవం

నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి జిల్లాలోని నార్నూర్ మండలం కొత్తపల్లి(హెచ్) గ్రామంలో బంజారాల దీక్షభూమి వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీక్షభూమి వద్ద కొలువుదీరిన జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహన్ తపస్వీ, ధర్మగురువు రామారావ్ మహరాజ్ మందిరాలను సుందరంగా ఆలయ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. దీక్ష గురువు శ్రీ సంత్ ప్రేంసింగ్ మహరాజ్ అధ్యక్షతన ప్రతి ఏడాది జనవరి 11న నిర్వహించే గురు శిష్యుల మిలన్ (దీక్ష దివస్)కు అన్ని ఏర్పాట్లు చేశారు. దీక్షభూమి వద్ద ఈనెల 11 లంబాడాల దైవం జగదాంబదేవి, రాష్ట్రీయ సంత్ మహన్ తపస్వీ, ధర్మ గురువు శ్రీ రామారావ్ మహరాజ్‌కు ఉదయం 11 గంటలకు ప్రత్యేకపూజ, బోగ్ బండార్ చేస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తదితర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చే లంబాడా (బంజారా) భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

దీక్షభూమి ఉద్యేశం

కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని శంకర్ లోద్ది వద్ద దీక్ష గురువు శ్రీ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్ తపస్సు చేస్తుండగా 1979 జనవరి 11న మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మ గురువు రాష్ట్రీయ సంత్ మహన్ తపస్వీ రామారావ్ మహరాజ్ ప్రేంసింగ్ మహరాజ్ వద్దకు వెళ్లాడు. దీక్ష ఎందుకు చేస్తున్నావు. ప్రేంసింగ్ నుంచి పలు విషయాలు తెలుసు కొని అతడిని శిష్యుడిగా స్వీకరించాడు. రామారావ్ మహరాజ్ అప్పటి నుంచి



శిష్యుడు ప్రేంసింగ్ 1988లో శంకర్ లొద్దిలో శివయజ్ఞం, 1992లో కొత్తపల్లి(హెచ్) దీక్ష భూమి వద్ద లక్ష్య చండీయజ్ఞం 1994, 2000, 2017 మహాలక్ష్మీ చండీ యజ్ఞం,2022 సహస్ర చండీ మహా యజ్ఞం నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది కొత్తపల్లి(హెచ్) లో జాతీయ బంజారాల దీక్ష భూమి వద్ద గురు, శిష్యుల మిలన్ (దీక్ష దివస్) ఘనంగా నిర్వహిస్తున్నారు.

సామాజిక అంశాలపై హితబోధనలు...

యెటా జనవరి 11న పూజా, భోగ్ బండారో కార్యక్రమంలో భాగంగా భక్తులను ఉద్యేశించి దీక్షా గురువు శ్రీ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్ మాట్లాడుతారు. మంచి, చెడులను వివరించి సామాజిక అంశాలపై భక్తులపై అవగాహన కల్పిస్తారు. మత్తు పానీయాలు, గుట్కా, జోలికి వెళ్లవద్దని సూచిస్తారు. బాల్య వివాహాలు రద్దు, వరకట్నం నిషేధంతో పాటు విద్య విలువతో పాటు పలు ప్రవచనాలు భక్తులకు చెబుతారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత

శ్రీ సంత్ సద్గురు ప్రేంసింగ్ మహరాజ్, దీక్ష గురువు కొత్తపెల్లి(హెచ్)

ప్రతి ఏడాది జనవరిలో గురు శిష్యుల మిలన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ఆధ్యాత్మికంతోనే సమాజ జాగృతం అవుతుంది. అనేక రాష్ట్రాల్లో సమాజం జాగృతం చేయడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను వివరిస్తున్నాం. శాంతి, అహింసతో ఏదైన సాధ్యమవుతుంది. వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

బదిలీపై వెళుతూ.. భావోద్వేగానికి గురైన ఎస్పీ

- తొలి పోస్టింగ్ ఉమ్మడి జిల్లాలోనే
- గజమాలతో సత్కరించి.. వాహనంలో సాగనంపి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తన తొలి పోస్టింగ్ ఉమ్మడి జిల్లాలో వచ్చిందని, ఎస్పీగా కూడా విధులు నిర్వహించడం మరవలేనని ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఎస్పీ డి. ఉదయ్ కుమార్‌రెడ్డిని ఏఆర్ పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో వీడ్కోలు సభను నిర్వహించారు. ముందుగా సాయుధ దళాలతో పరేడ్ నిర్వహించి గౌరవందనం సమర్పించారు. ఎస్పీ పరేడ్‌ను ప్రత్యేక వాహనంలో తిరిగి పరిశీలించారు. ఎస్పీని గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఎస్పీని హెడ్ క్వార్టర్స్ గేట్ వరకు జిల్లా పోలీసు అధికారులందరూ సిబ్బందితో సహా వాహనానికి ఏర్పాటు చేసిన తాడు ద్వారా లాగి ఘనంగా వీడ్కోలు పలికారు.

భావోద్వేగానికి గురైన ఎస్పీ...

అధికారుల సహకారంతో దేశంలో ఆదిలాబాద్ జిల్లాను శాంతియుత జిల్లాగా నిలిపామని బదిలీపై వెళ్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన భావోద్వేగానికి గురై మాట్లాడారు. ఎస్సైగా తన తొలి పోస్టింగ్ 1992లో ఉమ్మడి జిల్లాలో వచ్చిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తరువాత అందరి సహకారంతో శాంతిభద్రతలను కాపాడామన్నారు. ఎన్నికలతో పాటు అన్ని పండుగలను శాంతియుత వాతావరణం జరిగేల పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఈ చర్యల కారణంగా దేశంలోనే ఆదిలాబాద్ శాంతియుత జిల్లాలో స్థానం పొందిందన్నారు. అందరి సమిష్టి కృషితోనే ఈ ఘనతను సాధించామన్నారు. జిల్లాకు వచ్చే ముందు అధికారులు ఇక్కడి పరిస్థితులను తెలియజేశారన్నారు. వచ్చిన తరువాత బదిలీపై వెళ్లడం కష్టంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సమయ్‌జాన్ రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ శ్రీనివాస్, జి.పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, డీసీఆర్బీ, ఎస్‌బి, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, ఫింగర్‌ప్రింట్, వింగ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

8, 9న జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈనెల 8, 9 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఏస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సక్కు, ఆత్రం నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో జరుగుతున్న దోపిడీకి, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడటం కోసం ఎస్ఎఫ్ఐ విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న మతోన్మాద విద్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ విద్య విద్యావిధానం ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులకు భవిష్యత్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న విద్యవిధానాలకు వ్యతిరేకంగా పోరాడాలంటే విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు చాలా ఉపయోగపడుతుంటాయని అన్నారు. జిల్లాలో ఉన్న విద్యావేత్తలు, విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి కిరణ్, రమేష్ పాల్గొన్నారు.



మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తా



నవతెలంగాణ-కుభీర్

నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్సి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేషనల్ హెల్త్ మెడిసిన్ నిధులు రూ.20లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో స్థానిక సర్పంచ్ కవిత రాజేష్‌తో కలిసి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు గా కృషి చేస్తానని అన్నారు. భవన నిర్మాణ పనులలో నాణ్యత పాటిస్తూ, పది కాలాల పాటు భవనం నిలిచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వచ్చే ఏడాది పాటు రోగులకు వైద్య సదుపాయాయిలు కల్పించేలా చూడాలని అన్నారు. స్థానిక సర్పంచ్ కవిత రాజేష్, మండల నాయకులు సొప్పీ రమేష్, గులాబ్ నాయక్, సాయినాథ్, కనకయ్య, నాగేందర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవినాష్, సంతోష్, వసుంధర గ్రామస్తులు మండల నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి



నవతెలంగాణ-తలమడుగు

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డీఈఓ ప్రణీత అన్నారు. శుక్రవారం మండలంలోని భరంపూర్ జెడ్పీ ఉన్న పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అత్యధిక మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు బోధన నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈఓ వెంట సెక్టోరల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, మండల నోడల్ అధికారి వెంకట్‌రావ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

బస్సు ట్రిప్పులను పెంచిన ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-తలమడుగు

గత వారం రోజులు కింద నుంచి అదిలాబాద్ నుంచి కోసాయి వరకు ప్రయాణించాల్సిన ఆర్టీసీ బస్సును ఆ శాఖ అధికారులు రెండే ట్రిప్పులు నడపడంతో జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి శుక్రవారం సంబంధిత శాఖఅధికారులతో మాట్లాడి బస్సు ట్రిప్పులు పెంచే విధంగా కృషి చేశారు. తక్కువ ఆదాయం వస్తుందనే నెపంతో ఆర్టీసీ బస్సును రెండు ట్రిప్పులకే పరిమితం చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆరు ట్రిప్పులు నడిచే విధంగా కృషి చేశారు. దీంతో మండల ప్రజలు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి డిపో హౌసింగ్ మేనేజర్ సకాలంలో స్పందించి ప్రయాణికులకు బస్సు నడిచే విధంగా కృషి చేసినందుకు ఆర్టీసీ అధికారులకు స్వయంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆశాలకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం డాక్టర్ రాంబాబు ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతి ఆశా కార్యకర్తలు రోజువారిగా తమ గ్రామాల్లో గర్భిణీ, బాలింతల వారి ఇంటిని సందర్శించి వారికి కావాల్సిన ఆరోగ్య సమస్యల పైన అవగాన కల్పించాలని సూచించారు. వారికి నెల నెల టీకాలు, డెలివరీ ఇంట్లో కాకుండా ప్రభుత్వాస్పత్రిలో అయ్యే విధంగా వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమం సీహెచ్ఓ లక్ష్మి, హెచ్ఈఓ నాందేవ్, వైద్య సిబ్బంది సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ సతవ్వ, చౌహన్ చరణ్‌దాస్, అదీప్, హిమ బిందు, వివిధ గ్రామాల్లోని ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన ఖానాపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఏస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్‌కి చెందిన ముగ్బుల్‌ఖాన్(68) గురువారం నిర్మల్ పట్టణానికి స్కూటీపై పని నిమిత్తం వెళ్లి తిరిగి ఖానాపూర్ వస్తుండగా, మార్గమధ్యలో నర్సాపూర్ ఫారెస్ట్ చెక్ పోస్ట్ దగ్గర మామడ వైపు నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ముగ్బుల్ నడుపుతున్న స్కూటీని ఢీకొట్టాడు. బాధితుడు కింద పడటంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. వెంటనే అతనిని అంబులెన్సులో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. అతని కొడుకు మహమ్మద్ ఇలియాజ్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు మామడ గ్రామానికి చెందిన అంబటి సాయిరాం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. శుక్రవారం ఎంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ రాథోడ్ గోవింద్‌తో కలిసి అధికారులకు దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలను కోరారు. దీనితో పాటు మలేపూర్ గ్రామపంచాయతీలో అదేవిధంగా గాదిగూడ మండలంలోని ఖాండో గ్రామ పంచాయతీలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో స్పెషల్ అధికారులు డీఎల్పీఓ భిక్షపతి గౌడ్, ఎంపీడీఓ రమేష్, రామేశ్వర్, ఏఓలు గణేష్ రాథోడ్, రమేష్, ఏఈ శుభాని, తహిసీల్దార్ రాజలింగం, ఇన్‌ఛార్జి ఎంపీఓ గంగాసింగ్, సాయి ప్రసాద్, సర్పంచ్ పవార్ ఇందర్, చంద్రహరి, ఎంపీటీసీ కిరణ్, కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు, రాజన్న, అనురాగ్, ఉపసర్పంచ్ పైకు ఉన్నారు.

హరితహారానికి మొక్కల కొరత లేకుండా చూడాలి

నవతెలంగాణ-కౌటాల



వచ్చే సంవత్సరానికి హరితహారంలో నాటేందుకు మొక్కల కొరత లేకుండా చూడాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సర్పంచ్ వొజ్జల మౌనీష్‌తో కలిసి హరితహారం మొక్కల నర్సరీ పనులను ప్రారంభించారు. నర్సరీపై గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని, విధులు సక్రమంగా నిర్వహిస్తే మొక్కల కొరత లేకుండా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, కార్యదర్శి సాయికృష్ణ, బీఆర్ఎస్ యోజన మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ఆగయ్య, ముత్తయ్య ఉన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీపీయూఎస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు తాటి రవీందర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, జిల్లా అధ్యక్షుడు బండారి పోషం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల మధు, ఉపాధ్యక్షులు వనమాల రాజేష్, చివురాల ఓం ప్రకాష్, కార్యదర్శులు సోలంకి, గజంత్ రావు, సురేష్, రాజేందర్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బెజ్జూరు

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నవతెలంగాణ 2024 నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ భూమేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ ప్రజల పక్షాన ఉంటుందని, సమస్యలను వెలికితీసి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం సంతోషంగా భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భీంరావ్ నాయక్, ఆర్ఐ అచ్చుత్‌రావు, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని అమర్‌గొండ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త వజ్రమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణీలు, కిశోర బాలికలు, చిన్నపిల్లలకు అనేక రకాల సేవలందిస్తుందన్నారు. వాటినరి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, పాలు, గుడ్లు అందించడంతో పాటు గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు ప్రక్రియ పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎటువంటి తప్పులు లేకుండా నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఉమర్ హుస్సేన్, ఎంపీడీఓ శశికళ, గ్రామపంచాయతీ ఈఓ వంశీకృష్ణ, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని పిప్పర్‌గొంది, చొప్పన్‌గూడ, డాబా, లొద్దిగూడ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరణ కొనసాగుతుంది. తహసీల్దార్ రెహిమొద్దీన్, ఎంపీడీఓ శివకుమార్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు ప్రజాపాలనలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఆయా గ్రామ పంచాయతీలో అందజేయాలన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి గోయాగంకు బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆడే ప్రకాష్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మామడ మండలంలోని తాండ్ర గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. అభయహస్తం కింద దరఖాస్తు చేసుకునే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ అభయహస్తం కింద మహాలక్ష్మి రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్మల్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోందని, జనవరి 6 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. తొమ్మిదేండ్లలో ఒక్కరికి కూడా రేషన్‌కార్డు ఇవ్వని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు.

నిర్లక్ష్యంగా రోడ్డు పనులు

నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు నూతన రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా ముందుగా కల్వర్టుల నిర్మాణం కోసం గుంతలు తీశారు. నిర్మాణ సమయంలో ఏర్పాటు చేయాల్సిన ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళుతున్న కారు డ్రైవర్ గమనించకుండా అదే వేగంతో కల్వర్టు గుంతలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్నవారు స్వల్పంగా గాయపడ్డారు. అలాగే ఆర్టీసీ బస్సు గుంతలో పడే సమయంలో డ్రైవరు అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. నిర్లక్ష్యంగా రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



మాట్లాడుతున్న కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న సభలలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను డాటా ఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి సమాచారాన్ని కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్లతో పాటు దరఖాస్తుదారుడు నింపిన సమాచారాన్ని మాత్రమే అప్‌లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తైన తర్వాత సంబంధిత దరఖాస్తుదారుడి ఫోన్ ద్వారా మేసేజ్ వెళ్తుందన్నారు. 6 నుంచి 17లోగా దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎలాంటి తప్పులు జరిగిన ఆపరేటర్లపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేక రైతు ఉద్యమానికి మద్దతు

నవతెలంగాణ-బెజ్జూరు

దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఆరు నెలలుగా ఉద్యమిస్తున్న రైతులపై లాఠీచార్జ్ చేసి నాన్ బెయిలబుల్ కేసులు బనాయించడాన్ని కుమురం భీం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీష్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీ రద్దుకు రైతులు నిర్వహిస్తున్న పోరాటానికి పూర్తి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు ప్రజాపాలన పేరుతో మాది ప్రజాస్వామ్య ప్రభుత్వమని ప్రకటన చేస్తూ మరోవైపు రైతులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం గత ప్రభుత్వ అడుగుజాడల్లో నడవడమే అవుతుందన్నారు. కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఏరియాలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ వ్యర్థాలు, రసాయనాలతో తాగు, సాగు నీరు కాలుష్యం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. రైతులు తమ పంటలను నష్టపోతూ అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్రజా వ్యతిరేకమైన ఈ ప్రాజెక్టును వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డి ఇథనాల్ పరిశ్రమను నిలిపివేస్తున్నట్టు ప్రకటన చేసి 62 మంది రైతులపై పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, రాంచందర్, ఈశ్వర్, ప్రవీణ్, సుధాకర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోట సతీష్

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్టీయూ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ, బీసీ, హాస్టల్స్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ హేమంత్ బొర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ వసతి గృహాలలో పనిచేస్తున్న వాచ్‌మెన్, వాచ్ ఉమెన్, కామటీ, కుక్, స్కావెంజర్ తదితర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌లకు 11 నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు కుటుంబాన్ని పోషలించలేకపోతున్నారన్నారు. వారికి వచ్చే అరకొర వేతనాలను సక్రమంగా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు వారి బిల్స్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్మికులకు చెల్లించే జీతాలను ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, హెల్త్, గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఎస్సీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ సత్యశ్రీ, కోకన్వీనర్ లత, కవిత, బీసీ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ కొమురయ్య, కోకన్వీనర్ లక్ష్మి సభ్యులు శారద, రమాదేవి, రేవతి, కవిత, రాణి, రమ్య, పుష్పలత, రత్నమాల పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల వేతనాలు చెల్లించాలి: ఏఐటీయూసీ

నవతెలంగాణ-రెబ్బెన

కుమురం భీం జిల్లాలోని రెబ్బన నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకుపెండింగ్‌లో ఉన్న 10 నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్‌చేశారు. శుక్రవారం నర్సరీ కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో ఈనెల 10న డీఎఫ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పది నెలలుగా వేతనాలు లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలు చెల్లించాలని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపల్లెవాడ నర్సరీలో పనిచేసిన డబ్బులు రూ.3లక్షలు 3 సంవత్సరాల నుండి చెల్లించడం లేదని, ఎన్ని సార్లు అడిగిన రేపుమాపు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వేతనాలు చెల్లించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సరీ కార్మికులకు కనీస వేతనం రోజు కూలి రూ.600 చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా రూ. 10 లక్షలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కరంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే 10న డీఎఫ్ఓ కార్యాలయం ముట్టడించి హక్కులను సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ నర్సరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, కార్మికులు సుమలత, సతీష్, శంకరమ్మ, కవిత, దశరథ్, పెంటయ్య, తార, లక్ష్మీ, కమల, నిర్మల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

బీమా కుటుంబానికి ధీమా ఇస్తుంది

- టీజీబీ మేనేజర్ నరసింహస్వామి

నవతెలంగాణ-కౌటాల

బీమా కుటుంబానికి ధీమా ఇస్తుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపెల్లి గ్రామంలో ఖాతాదారులకు లావాదేవీలపై అవగాహన కల్పిస్తూ బీమా వల్ల ప్రయోజనలను వివరించారు. ఖాతాలో జరిగే లావాదేవీలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఫోన్ నంబర్లను లింక్ చేసుకోవాలన్నారు. మోసాలు జరిగే అవకాశముండదని తెలిపారు. ప్రధానమంత్రి సురక్షా, జీవనజ్యోతి బీమా యోజన పథకాలలో చేరడం వల్ల భవిష్యత్తులో ఖాతాదారుడు మరణిస్తే కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 సంవత్సరాలు నిండిన తర్వాత భార్యభర్తలిద్దరు బ్రతికున్నంతకాలం నెలకు రూ.ఐదు వేల చొప్పున ప్రతినెల పెన్షన్ వారి ఖాతాలో జమవుతుందన్నారు. భార్యభర్తలిద్దరు మరణించిన అనంతరం వారసులకు రూ.8.75 లక్షలు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సంబంధిత బ్రాంచ్ బ్యాంకులలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ రాజేష్, సర్పంచ్ సోయం సురేష్, సీఎస్‌పీ మొరేశ్వర్, రోహిని, ఆనంద్, దేవాజీ, కుశాబ్‌రావు, కిశోర్, కాశీనాథ్, రైతులు పాల్గొన్నారు.

7 నుంచి బంజారా దీక్ష భూమి మిలన్ దినోత్సవం



మాట్లాడుతున్న సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్

నవతెలంగాణ-కెరమెరి

జాతీయ బంజారా దీక్ష భూమి కొత్తపల్లిలో 7 నుంచి 15 వరకు నిర్వహించే దీక్షభూమి మిలన్ దినోత్సవ జాతరను విజవంతం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో సేవాలాల్ సేన నాయకులతో కలిసి మాట్లాడారు. జాతర ఉత్సవాలకు జిల్లా నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు. సేవాలాల్ దీక్ష భూమి జాతర ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ. 25001, ద్వితీయ బహుమతి రూ. 16001 నగదును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఔత్సాహికులు కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ శేషారావ్, వెంకటి, రాందాస్ పాల్గొన్నారు.

విప్లవ పార్టీల విలీన మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

విప్లవ పార్టీల విలీన మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.గంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 2024, మార్చి 3, 4, 5 తేదీల్లో మూడు విప్లవ పార్టీలు విలీనం కాబోతున్నాయని, విప్లవోద్యమ చరిత్రలో ఇదొక మంచి పరిణామమని అన్నారు. ఖమ్మంలో యాభై వేల మంది ప్రజలతో జరగబోయే బహిరంగ సభకు జిల్లా నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), రివల్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీలు విప్లవోద్యమ నిర్మాణంలో ఒకే అవగాహన ఏర్పరచుకొని ఒకే పార్టీగా ఏర్పడబోతున్నాయని అన్నారు. మారిన పరిస్థితులను అంచనావేసి భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు తగ్గట్టుగా సరైన పంతాను రూపొందించుకోబోతున్నాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు విప్లవ పార్టీలు ఒకే తాటిపైకి రావడం గొప్ప విషయమని అన్నారు. మూడు విప్లవ పార్టీలు కలిసి ఒకే జాతీయ విప్లవ పార్టీగా ఏర్పడటం విప్లవోద్యమంలో ఒక మైలురాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, గంగామణి, కవిత పాల్గొన్నారు.

రేపటి గాండ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఈనెల 7న నిర్వహించ తలపెట్టిన అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నంవార్ రాజేశ్వర్, తమ్మలవార్ చందు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 7న సంఘం ఆత్మీయ సమ్మేళనంతో పాటు నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం, కొత్త క్యాలెండర్ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ సోయం బాపూరావు, మున్సిపల్ చైర్మెన్ ప్రేమేందర్, డీసీసీబి చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో పాటు రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. కుల బాంధవులు, సంఘం కార్యవర్గ సభ్యులు కుటుంబ సమేతంగా పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఆసపు విలాస్, యువజన సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రమోద్, దినేష్, ఉపాధ్యక్షులు మహేష్, నిహాల్, కార్యవర్గ సభ్యులు స్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఇంటికి నిప్పంటించిన దుండగులు

నవతెలంగాణ-బెజ్జూరు

బెజ్జూరు జెడ్పీటీసీ పంద్రం పుష్పలత నివాస గృహాన్ని గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి నిప్పంటించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోమిని మారుమూల ప్రాంతంలో నూతనంగా నివాస గృహాన్ని ఏర్పాటుచేసుకొని అందులో పత్తిపంటను నిల్వ ఉంచుకున్నారు. గుర్తు తెలియని దుండగులు ఎవరూలేని సమయంలో నివాస గృహానికి నిప్పంటించారు. మంటలు చెలరేగడంతో సమీప గ్రామ ప్రజలు సమాచారం అందించడంతో హుటాహుటిన వెళ్లి బిందెలతో నిప్పును ఆర్పించారు. దీంతో సుమారు రూ.20 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు జెడ్పీటీసీ పుష్పలత తెలిపారు. తన నివాస గృహానికి నిప్పంటించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై విక్రమ్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్యానల్ టీం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని సోమిని ఆశ్రమ పాఠశాలను శుక్రవారం కాగజ్‌నగర్ డివిజన్ ప్యానల్ టీం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను బోధిస్తున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం విద్యార్థులకు మెనూ అందించాలని ఆదేశించారు. ప్రతినెల సరుకులు సరఫరా అవుతున్నాయో లేదో అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ టీం ఉపాధ్యాయులు శ్రీనివాస్, మధుసూధన్, ప్రసాద్, ధర్మన్న పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయళ్ల అరెస్ట్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బంబారా గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారంతో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.2250 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేకాట ఆడిన, దేశీదారు, గుడుంబా, గంజాయి విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, వాని వివనాలపే గోప్యంగా ఉంచుతామన్నారు.

తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన దరఖాస్తుల డాటా నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఇప్పటికే 95 శాతం పూర్తయ్యిందని అన్నారు. దరఖాస్తుల డేటా నమోదుని ఈనెల 17 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ధరణి, తదితర డేటాను ఎంట్రీ చేసిన అనుభవం ఉందని ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. దరఖాస్తులు గల్లంతు కాకుండా పూర్తి జాగ్రత్త వహించి భద్రపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే ఆపరేటర్‌తో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డాటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని, ఆధార్, రేషన్ కార్డు, సెల్ నంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ వినోద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియను వివరించి ఆపరేటర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్త, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ గణపతి, మున్సిపల్ కమీషనర్ శైలజ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

గంగపుత్ర సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గంగపుత్ర సంఘం డైరెక్టర్ పందిరి పోశెట్టి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘ భవనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో జిల్లా డైరెక్టర్‌గా నియమించినందుకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలి

నవతెలంగాణ-తాండూర్



ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి అత్యంత విలువైనదని, సమయాన్ని వథా చేయకుండా ఇష్టంతో చదవాలని ప్రముఖ సైకాలజిస్ట్, మెటివేషనల్ స్పీకర్, ఎన్ఎల్పీ ట్రైనర్ రామటెంకి వెంటయ్య అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన మంచి మార్కులు సాధించడానికి కావాల్సిన లర్నింగ్, స్టడీ స్కిల్స్, కెరియర్ కౌన్సిలింగ్పై అవగాహన ముఖ్యమన్నారు. అనంతరం పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, పదవ తరగతి తరువాత అందుబాటులో ఉండే కోర్సుల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈ.రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.రాజ రమేష్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మారుమూల కొలాం గ్రామం రాయికుంటలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుందన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలు చలితో బాధ పడుతున్నారని తెలిసి దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాంజీగోండ్ ఆశయ సాధన సమితి చైర్మెన్ మర్సుకోల తిరుపతి, దేవుని గూడ మాజీ సర్పంచ్ పర్చక సుదాకర్ పాల్గొన్నారు.

'తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూస్తాం'



నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూస్తామని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతిపంపు చెడిపోవడంతో రిపేరు చేయించారు. వచ్చే వేసవిలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా, మంచినీరు అందిస్తామన్నారు. ఇందులో కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు జాడి వెంకటయ్య, గ్రామస్తులు కే. శంకర్, గంగాధర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

అదనపు ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-తాండూర్

పిల్లలకు ఆరు నెలల ప్రాయంలో అదనపు ఆహారాన్ని అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని సీడీపీఓ ఉమాదేవి అన్నారు. శుక్రవారం మాదారం 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీలోని మాదారం1,2 అంగన్వాడీ సెంటర్లో సామాజిక వేడుకల్లో భాగంగా సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆరు నెలల వయస్సులో ఘనమైన ఆహార పదార్థాలను మెల్లమెల్లగా అలవాటు చేయాలన్నారు. పప్పులు, బెల్లం, అన్నం, నెయ్యి నుజ్జునజ్జుగా చేసి ఉగ్గు రూపంలో తినిపించాలన్నారు. శిశువులకు ఉగ్గు రూపంలో ఘన పదార్థాలను తినిపించడం ద్వారా నోటిలో లాలాజలం ఉత్పన్నమై జీర్ణ వ్యవస్థ పటిష్టమవుతుందని తెలిపారు. ఐసీడీఎస్ ద్వారా బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం సూపర్వైజర్ మమత, సర్పంచ్ గాజుల సుజాత, అంగన్వాడీ టీచరులు సువర్ణ, తిరుమలేశ్వరి, లక్ష్మీ, ఆయా, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోకల సురేష్ (62) గుండెపోటుతో మృతి చెందారు. సురేష్కు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మరణించినట్టు భార్య తోకల సరస్వతి తెలిపారు. ఆయన గతంలో తెలుగుదేశం పార్టీలో చురుకుగా పనిచేసి రాథోడ్ రమేష్కు సన్నిహితుగా మెలిగారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలోనూ పాత్ర పోశించారు.బీఆర్ఎస్లో చేరి పదేండ్లుగా సేవలు అందించారు. సురేష్ మృతి పార్టీకి తీరని లోటని ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జన్నారం జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, సీపీఐ(ఎం) పార్టీ జిల్లా నాయకులు కలిందర్ఖాన్ పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకుల ఆధ్వర్యంలో సీఅండ్ ఎండీ బలరాం నాయక్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణిలో హైపర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, జీఓ నెంబర్ 22ను వెంటనే అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యం అందించాలని, గతంలో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం బోనస్ పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధమైన, పండుగ సెలవులు కల్పించాలన్నారు. దీనిపై సింగరేణి సీఅండ్ఎండీ బలరాం సానుకూలంగా స్పందించి వెంటనే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అక్బర్ అలీ, రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం, ఇల్లందు రీజియన్ కార్యదర్శులు బుర్ర తిరుపతి, అఫ్రోజ్ ఖాన్, క్రిస్టోఫర్, శంకర్, నాయకులు ఎర్రగాని కృష్ణ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఆన్లైన్లో నమోదు చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కల్పించిన 5 గ్యారంటీల పథకాల కోసం ప్రజలు అందించిన దరఖాస్తుల వివరాలను నిర్ణీత గడువులోగా ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి స్థాయిలో ఆన్లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దారులు, ఎంపీడీఓ, మున్సిపల్ వార్డు అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు దరఖాస్తుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వార్డుల వారిగా దరఖాస్తు సంఖ్య నమోదు చేసిన అనంతరం కులం, పుట్టిన తేదీ, ఆధార్, రేషన్కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా ఇతర వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తుఫారంలో ఉన్న ప్రకారంగానే నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ క్రమంలో వచ్చే హెచ్చరికలు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అర్హత గల ప్రతి లబ్దిదారుడు గ్యారంటీ పథకాల లబ్ది పొందేలా ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలని, దరఖాస్తు ఫారంలను, జతపరిచిన నకలు ప్రతులను పరీక్షించాలని, దరఖాస్తులో పొందుపరిచిన ప్రతి సమాచారాన్ని నమోదు చేయాలని, డాటా ఎంట్రీ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేసి ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ల మొబైల్ నంబర్లతో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరుగుతుందని, ఆన్లైన్లో వివరాలు నమోదుకు సంబంధించిన సూచనలు, సలహాలు సమయానుగుణంగా అందిస్తామన్నారు. 6 నుండి 17లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మండలాలలో అందుబాటులో ఉన్న వివిధ శాఖలకు చెందిన ఆపరేటర్ల వివరాలు సేకరించాలని, నమోదు కార్యక్రమానికి అనుగుణంగా ఆపరేటర్లకు విధులు కేటాయించాలని, కంప్యూటర్లు, ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల వారిగా ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. పొరపట్లు దొర్లిన ఆపరేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, డీసీఓ వెంకటేశ్వరావు, జడ్పీ సీఈఓ నరేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

నవతెలంగాణ-వేమనపల్లి

నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 71 మంది లబ్దిదారులకు రూ.71,08,236 విలువ చేసే కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు కష్టసుఖాల్లో ఎల్లవేళల అందుబాటులో ఉంటూ అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేకు తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీపీ కోలి స్వర్ణలత శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం దస్నాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేమనపల్లి మండల జడ్పీటీసీ, నీల్వాయి ఎంపీటీసీ రుద్రభట్ల స్వర్ణలత సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, నీల్వాయి సర్పంచ్ గాలి మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమానికి ఆయన కుటుంబ సమేతంగా హాజరయ్యారు. సన్మానం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేమనపల్లి అభివృద్ధికి అన్నింటికంటే అధికంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అదే విధంగా పోడు భూముల పట్టాల విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోడు భూములకు పట్టాలు ఇచ్చామని, అప్పటి నుండి ఇప్పటి వరకు ఒక్క పట్టా కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని గుర్తు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు హామీలను నెరవేర్చామని, మిగిలిన నాలుగింటిని అమలు పరచడానికి ప్రజాపాలన ధరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెపెల్లి మండల ఎంపీపీ సృజననర్సింగ రావు, మండల సర్పంచులు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కళ్యాణ లక్ష్మీ చెక్కును అందిస్తున ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి

అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు అగ్రికల్చరల్ జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఎస్సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వేల్పుల కుమారి అధ్యక్షతన శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి నర్సరీ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ 2022 సెప్టెంబర్లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలు, బోనస్ చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలో అగ్రిమెంట్ అయిందన్నారు. అగ్రిమెంట్ చేసి సంవత్సరం దాటిన ఇప్పటివరకు నర్సరీ కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు, బోనస్ చెల్లించడం లేదన్నారు. దీనివల్ల కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారని, వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలను, బోనస్ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటానికి సైతం సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ నర్సరీ అధ్యక్ష, కార్యదర్శులు కట్లకళా, మోతే సరోజన, మందమర్రి నర్సరీ అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, అత్తె కళావతి, గోలేటి నర్సరీ కార్యదర్శి శారద, కార్మికులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రజాపాలన దరఖాస్తులను నేటితో ముగియనుండగా గడువులోపు దరఖాస్తులు అందించాలని 5వ వార్డు కౌన్సిలర్ జి. మహేష్ కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు పరిధిలోని అమరవాది సెంటర్ వద్ద స్థానిక కౌన్సిలర్ జిలకర మహేష్, వార్డు ఆఫీసర్ నవీన్, ఆర్పీ రాజేశ్వరి, ఆశ వర్కర్ గౌరమ్మ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ శనివారం సాయంత్రం 6 గంటల వరకు ఉందని ఆలోగా దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

జన్నారం : 6 గ్యారంటీ స్కీంల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. శుక్రవారం మండలంలోని కిస్టాపూర్, కవ్వాల్, ధర్మారం, కామన్ పల్లి గ్రామాల్లో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీఈఓ రమేష్ లబ్దిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారంతో ఈ దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుందని ప్రతి ఒక్కరు శనివారం వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కామన్పల్లి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ జనుగురి దుర్గా మాధురి సతీష్, కిష్టాపూర్ సర్పంచ్ కోలతార పద్మారావు, ఎంపీటీసీ మచ్చ పోచమ్మ శంకరయ్య, ధర్మారం సర్పంచ్ దుర్గం గంగాధర్, కవ్వాల్ సర్పంచ్ హస్లి బాయ్ కలిరాం పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



ప్రజాపాలనలో మాట్లాడుతున్న తహసీల్దార్ రోహిత్

ప్రజాపాలన గ్రామసభలు విజయవంతం

తాండూర్ : మండలంలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. శుక్రవారం గోపాల్ నగర్ పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలనలో తహసీల్దార్ రోహిత్ పాల్గొని ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేస్తూ దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి వసంత, ఆర్ఐ మురళీధర్ రావు, ఏఈ అప్పల నాయుడు, ఏఓ కిరణ్మాయి పాల్గొన్నారు. నీలాయపల్లి పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఏఈ ప్రభాకర్ పరిశీలించారు.

గ్రూప్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్, ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.ప్రవీణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఫిబ్రవరి 1 నుండి ప్రారంభమమై నాలుగు నెలల పాటు సాగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు 8 నుండి 20వ తేదీ లోగా ఆన్లైన్ టీఎస్బీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్, స్టడిసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందన్నారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. వివరాలకు 08732-221280లో సంప్రదించాలాని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవతెలంగాణ క్యాలెండర్ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నవతెలంగాణ తెలుగు దినపత్రిక రూపొందించిన 2024 నూతన క్యాలండర్ను మున్సిపల్ చైర్మెన్ నల్మాస్ కాంతయ్య ఆవిష్కరించారు. శుక్రవారం నివాసంలో విలేకరి మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ క్యాలండర్ను ఆవిష్కరింపజేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యంలో ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టుల సేవలు సమాజంలో ఎంతో కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, సీనియర్ నాయకులు నడిమెట్ల రాజన్న, కౌన్సిలర్ శ్రీకాంత్, కో ఆప్షన్ సభ్యులు నూనె ప్రవీణ్, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఉత్తమ దంపతుల అవార్డు అందుకున్న గోపిక, నరేష్



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి పట్టణానికి చెందిన ఉప్పులేటి గోపిక, నరేష్లు ఉత్తమ దంపతుల అవార్డు అందుకున్నారు. తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ పట్టణంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకోని సేవ కార్యక్రమాలను నిర్వహించిన వారికి అవార్డులను అందించారు. ఇందులో మందమర్రి పట్టణానికి చెందిన తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పులేటి నరేష్, రాష్ట్ర మహిళా కోకన్వీనర్ గోపికలు ఉత్తమ దంపతులగా ఎంపికయ్యారు. కాగా వారిని టీజీపీఏ వ్యవస్థాపక అధ్యక్షులు మోత్కూరి యాదయ్య, గౌరవ అధ్యక్షులు జాన్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దారా మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె పవన్ పాల్గొన్నారు.

లింగయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వినోద్



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పోలవేణి పోశం యాదవ్ కుటుంబ సభ్యులను శుక్రవారం రాత్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. రూ. పది వేల నగదు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో పోశం యాదవ్ తండ్రి లింగయ్య మరణించాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకోంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, ముత్యంపల్లి గ్రామ అధ్యక్షులు దారవేణి రాజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి రేశవేని ఓదెలు యాదవ్, యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షులు పుర కుమారస్వామి యాదవ్, ముత్యంపల్లి యూత్ అధ్యక్షులు మారం రాజ్ కుమార్ యాదవ్, వార్డ్ మెంబర్ మంద వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

ఇచ్చోడ : క్రీడలతోనే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం గుడిహత్నూర్ మండలంలోని మాన్కపూర్ గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కుమురంభీం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకోని, టాస్ వేసి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సహ పరిచారు. ఎమ్మెల్యేను క్రికెట్ మేనేజ్మెంట్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహద పడతాయని అన్నారు. యువకులు క్రీడల్లో రాణిస్తూనే సమాజాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ముండే పాండురంగ్, తిరుమల్ గౌడ్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్రెడ్డి, నాయకులు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూర్: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో పీఆర్టీయూటీఎస్ 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్లను విడుదల చేశారు. అనంతరం మండల అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ను రీ షెడ్యూల్ చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మే, జూన్ నెలలోగా పీఆర్సీ అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు వనమాల బాలాజీ ప్రసాద్, గుంటి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తిరుపతి, మండల కార్యదర్శి శ్రావణ్, సీనియర్ నాయకులు నరేందర్, శ్రీనివాస్, మరియా పాల్గొన్నారు.